వార్త

సోమవారం 17 ఆగస్టు 2026

I

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## బళ్ల అటవీ ప్రాంతంలో
# రెండు ఏనుగులు

### బైరెడ్డిపల్లి మండలానికి చేరిన 16 ఏనుగుల గుంపు !!

కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో పంటలపై దాడులు చేసిన 16 ఏనుగుల గుంపును అటవీ అధికారులు తమిళనాడు అటవీ ప్రాంతంలోకి తరిమేయగా అవి మరలా రూట్ మార్చి వి.కోట మండలం నాయకనేరి మీదుగా బైరెడ్డిపల్లి మండలం వెంగంవారిపల్లి అటవీ ప్రాంతంలోకి చేరాయి. ఇక రామకుప్పం మండలంలోనే సంచరించిన మరో రెండు జంట ఏనుగులు సైతం తమిళనాడుకు చేరాయి. కుప్పం, రామకుప్పం మండలాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగులు రెండూ ఆదివారం రాత్రికి రామకుప్పం మండలం బళ్ల ప్రాంతం వైపుకు చేరాయి.

# మామపై అల్లుడు దాడి
## అక్కడికక్కడే మృతి

పూతలపట్టు, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని తేనేపల్లి పంచాయతీ పరిధిలోని రంగంపేట క్రాస్ ఎస్టీ కాలనీలో మామపై అల్లుడు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం అశోక్ ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండగా ఆయన మామ సుబ్రమణ్యం మందలించినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన అశోక్ మామ సుబ్రమణ్యంపై పిడిగుద్దులతో దాడి చేసినట్లు సమాచారం. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.



ఫైల్‌ఫోటో

## ప్రజా సమస్యల పరిష్కారానికై
# కలసికట్టుగా పనిచేద్దాం

### కమిషనర్ ఎం.జయకృష్ణ



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 16 ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారం, నగర అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు కలసికట్టుగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులకు సూచించారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జయకృష్ణ ఆదివారం మధ్యాహ్నం అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల నుండి వచ్చే అన్ని వినతులకు సరైన పరిష్కారం చూపేందుకు ప్రతి అధికారి పనిచేయాలని తెలిపారు. ప్రతి విభాగంలోని అధికారులు మీ విభాగంలో ఉన్న పనులకు కాలపరి మితి పెట్టుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ప్రతి సమస్య పరిష్కారం అర్జీదారుడు సంతృప్తి పడేలా ఉండాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి తాను నిజాయితీగా చేసిన పనిని గర్వంగా కుటుంబసభ్యులకు, స్నేహితులకు చెప్పుకునేలా విధులు నిర్వహించాలని తెలిపారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని తెలిపారు. నగరంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనులు ప్రజలందరూ మెచ్చేలా చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలో అభివృద్ధి పనులకు నిధులు సమకూరేలా అన్ని రకాల పన్నులు సకాలంలో వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (శీ।శి) 2026 ను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమోళి, ఈ.ఈ.రవి, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డిసిపి దేవి కుమారి, ఏసీపీలు పార్వతిప్రియ, మూర్తి, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్, ఈ డిటి సుధాకర్ నాయక్, డి.ఈలు, శానిటరీ సూపర్ వైజర్లు, మెప్మా అధికారులు, సూపరింటెండెంట్లు, తదితరులు ఉన్నారు.

# అంతం లేని 'ఉపాధి' అవినీతి కథ

### - ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లోకి కూలీల డబ్బులు

గుడిపాల, ఆగస్టు 16 ప్రభాతవార్త:

గుడిపాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి జరుగుతోంది. కూలీలు వలస బాట పట్టకుండా స్థానికంగా వారికి పని కల్పించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. అయితే గుడిపాల మండలంలో కొంతమంది ప్రభుత్వ ఉద్యోగుల పేరిట జాబ్ కార్డులు రూపొందించి క్షేత్ర స్థాయిలో పనులు చేసిన వారికి చెల్లించాల్సిన కూలీ డబ్బులను ఈ పథకం గురించి ఏ మాత్రం తెలియని ప్రభుత్వ ఉద్యోగుల బ్యాంకు ఖాతాలోకి వేస్తున్నట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. ఈ వ్యవహారంపై పలు పత్రికల్లో వార్తలు వచ్చినా ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధి పనులు చేసే కూలీలకు వుండాల్సిన జాబ్ కార్డులు ఎలా వచ్చాయనే విషయం అంతుబట్టడం లేదు. ఉపాధి కూలీలకు ఇచ్చే జాబ్ కార్డులను ఎంపిడిఓ మంజూరు చేయాల్సి వుంటుంది. అంటే గుడిపాల మండలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జాబ్ కార్డులను ఎంపిడిఓ మంజూరు చేశారా! లేక ఉపాధి ఎపిఓ మంజూరు చేశారా! లేక క్షేత్ర స్థాయి సహాయకులు గ్రామ పంచాయతీ కార్యదర్శిని బుట్టలో వేసుకుని జాబ్‌కార్డు సిద్ధం చేశారా! అనే విషయంపై స్పష్టత లేదు. మండలంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన నిధులు వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగినుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నట్లు సాక్ష్యాధారాలతో పత్రికల్లో ప్రచురితం అయ్యింది. అలాగే ఒక అర్టీసీ ఉద్యోగి పేరిట జాబ్ కార్డు మంజూరు చేసి అతని బ్యాంకు ఖాతాలో సైతం ఉపాధి నిధులను అక్రమార్కులు దండుకుంటున్నారని నిరూపణ అయ్యింది. అయితే ఉద్యోగులకు జాబ్ కార్డులను ఎంపిడిఓ మంజూరు చేశారా! లేక ఎపిఓ స్థాయిలో ఉద్యోగులకు జాబ్ కార్డులు మంజూరు అయ్యాయా! లేక పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, క్షేత్ర సహాయకులు ఉపాధి కంప్యూటర్ ఆపరేటర్‌తో కుమ్మక్కై ఉద్యోగులకు జాబ్ కార్డులు మంజూరు చేశారా! అనేది తేలాల్సి వుంది.



గుడిపాల మండలంలో ప్రభుత్వ విధులు నిర్వర్తించే ఉద్యోగుల పేరిట జాబ్ కార్డుల సిద్ధం చేసి ఉపాధి నిధులను ప్రక్కదారి పట్టించడంతో ఈ మండలంలో ఉపాధి పనుల్లో ఎంతో భారీగా అవినీతి జరిగి వుంటుందనే విషయంపై ప్రస్తుతం సర్వత్రా చర్చ జరుగుతుంది. మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులపై అధికారులు పక్కాగా విచారణ చేస్తే ఉపాధి అక్రమాలు భారీగా వెలుగు చూసే అవకాశం వుంది.

## ద్రౌపతీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో
# అగ్నిగుండ ప్రవేశం

### ప్రవేశం చేసిన 800మంది భక్తులు
### సింహవాహనంలో దర్శనం



నారాయణవనం, ఆగస్టు 16 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అగ్నిగుండప్రవేశ కార్యక్రమం జరిగింది. చేతికి కంకణం ధరించిన భక్తులు నారాయణవనంకు చుట్టు వున్నట్టు వంటి ఏడుభావుల్లో పవిత్రస్నానాలను చేసిన తర్వాత అగ్నిగుండం ప్రవేశం చేశారు. సుమారు 800మంది వరకు భక్తులు మొక్కుబడితో చేతికి కంకణం ధరించి అగ్నిగుండప్రవేశం చేయడానికి ముందుకు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి 8గంటలకు అమ్మవారిని, స్వామివారిని సింహవాహనంపై అధిరోహించి పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఊరేగించారు. ఆలయం ఎదుట వేలాదిమంది భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే మొక్కుబడి కలిగిన భక్తులు ఆలయం ఎదుట జంతుబలి సమర్పించారు.

## యువతకు స్ఫూర్తిదాయకం
# గౌతు లచ్చన్న జీవితం

### - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



సర్ధార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డిఆర్ఓ , తదితరులు

చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్ధార్ గౌతు లచ్చన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశభవనంలో ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్ధార్ గౌతు లచ్చన్న 117వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించి సర్ధార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి డిఆర్ఓ మోహన్‌కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సర్ధార్ గౌతు లచ్చన్న తన జీవితంను ప్రజా సేవలకు అంకితం చేసి నిబద్ధత కల్గిన నాయకుడన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించిన లచ్చన్న పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంతో పాటు స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారన్నారు. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, మద్యపాన నిషేధం కోసం, కల్లుగీత, చేనేత కార్మికులు, పేదలు, బీసీ, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం ఆయన పోరాడారన్నారు. అధికారంలో వున్న సమయంలోనే కాకుండా ప్రతిపక్షంలో వున్నప్పటికీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా గౌతు లచ్చన్నకు ప్రత్యేక గుర్తింపు వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్నా, బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ భాషా, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రమోదమల్లె, బీసీ నాయకులు నాగరాజు గౌడ్, కృష్ణమూర్తిగౌడ్, గోపిగౌడ్, రిటైర్డ్ ఎక్సైజ్ సిఐ ఈశ్వరయ్య, ఎంబీసీ నాయకులు పి.రవి, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, నీరజాక్షులు, ప్రభావతమ్మ, ప్రసాద్, జనార్ధన్‌గౌడ్, ఈడిగ కులస్తులు, ఇతర ప్రజాప్రతినిధులు, బీసీ సంక్షేమశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కుటుంబ రక్షణకు
# బండికుంభాలు

### బకాసురుడిని వధించిన భీమసేనుడు



చంద్రగిరి, ఆగస్టు 16 ప్రభాతవార్త:

ఓ బ్రాహ్మణ కుటుంబాన్ని బకాసురుడనే రాక్షసుడి బారి నుండి రక్షించడానికి తల్లి కుంతీదేవి ఆజ్ఞానుసారం భీమ సేనుడు ఎడ్లబండిపై ఇంటింటికి తిరిగి పిండి వంటలతో కూడిన భోజనాన్ని (కుం బాలు) సేకరించాడు. చారిత్రాత్మక చంద్రగిరిలో మహాభారత ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బకాసుర వధ నాటకాన్ని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. బకాసురుడు అనే రాక్షసుడు ఓ గ్రామంపై పడి ప్రజలను మింగేస్తుండగా ప్రజలు అతనిని ఒప్పించి రోజుకు ఒకరు నీకు ఆహారం కాగలమని విన్నవించుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఒక రోజున బ్రాహ్మణ కుటుంబంలోని యువకుడి వంతు రావడంతో తల్లిదండ్రులు తీవ్రంగా రోధించ సాగారు. ఇది గమనించిన కుంతీదేవి వారిని ఓదార్చి మీ కుమారుడికి బదులుగా నా కుమారుడు వెళతాడని భీమసేనుడిని పంపడానికి నిర్ణయిస్తుంది. దీంతో తల్లి ఆదేశాలతో భీమసేనుడు ఎడ్లబండిపై ఇంటింటికి వెళ్ళి భోజనాలను స్వీకరించి బకాసురుడి కోసం అడవికి బయలుదేరాడు. అటవీ ప్రాంతం సమీపించే క్రమంలో గ్రామస్థుల నుండి సేకరించిన భోజనాలను తనే ఆరగించడం మొదలు పెట్టాడు. చివరికి బకాసురుడి వద్దకు చేరుకునే సమయానికి దాదాపు బండి కుంభం ఖాళీ అయిపోతుండగా బకాసురుడు కోపోద్రిక్తుడయ్యాడు. దీంతో భీమసేనుడిని ఆహారంగా తీసుకునేందుకు తలపడతాడు. భీమసేనుడికి, బకాసురుడికి జరిగిన భీకర పోరులో భీమసేనుడు, బకాసురుడిని వధించే నాటకాన్ని శ్రీ వెంకటేశ్వర నాట్యకళా మండలి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు.

# ఆధ్యాత్మిక సేవలను ప్రపంచం నలుమూలలా విస్తరణ

### -ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ

తిరుపతి,ఆగస్టు 16ప్రభాతవార్త:



టిటిడి ఆధ్యాత్మిక భక్తి ఛానల్ ఎస్వీబిసిని మరింత అభివృద్ధి చేసి టిటిడి ఖ్యాతి ని, ఆధ్యాత్మిక సేవలను ప్రపంచం నలుమూలలా విస్తరిస్తానని ఆ ఛానెల్ ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ తెలిపారు.ఎస్వీబిసి ఛైర్మన్‌గా నియమితులైన శ్రీధర్ వర్మ ఆదివారం తిరుపతి తాతయ్య గుంట అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయం వద్ద పాలక మండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి,మహేష్ యాదవ్ అమ్మవారి పసుపు కుంకుమ,ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు... అనంతరం శ్రీధర్ వర్మ, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి ఇంటికి చేరుకుని, మర్యాద పూర్వకంగా కలిశారు..

# ముక్కంటీశుని ఆలయం: శివనామస్మరణతో పునీతం

### రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది.వరుస సెలవులతో భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు.ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. వేదపండితులు,అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఆదివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళ కళ లాడింది.ఒరెండు రోజులుగా భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే ఆన్‌లైన్‌కు భక్తులు అలవాటు పడుతున్నారు.



**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**

వేసవి సెలవులు పూర్తి కావస్తుండగా రెండు రోజులుగా ఆల యానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ఇఓ బికె వెంకటేశు పర్యవేక్షించారు.

**నిబంధనలతో చిక్కులు:**

ఆలయానికి వచ్చే భక్తులు ఆలయంలో రోజుకొక నిబంధనలతో సతమతమౌతున్నారు.ప్రస్తుతం కొత్తగా 'ఆన్‌లైన్‌కష్టాలు చోటు చేసుకున్నాయి'. పిఆర్ఓ కార్యాలయం నుంచి కొందరు విఐపిల ము సుగులో అంతరాలయ దర్శనానికి తీసుకెళ్ళటంతో భక్తుల్లో అసహనం చోటు చేసుకుంది. దేవుని ముందు అందరూ సమానులే అంటారు.కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో 'పలుకుబడికే'పెద్ద పీట అన్నట్లుమారింది. ఇక్కడ చట్టాలు కొందరికి చుట్టాలుగామారి కనకవర్షం కురిపిస్తుంది. దిశ దెశ నిర్దేశం లేని నిబంధనలతో స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద ఉన్న సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.



## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

మండలంలోని శెట్టిగుంట ప్రధాన రహదారి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మైదుకూరు నుండి తిరుపతికి వెళుతున్న ద్విచక్ర వాహనము, పుత్తూరు నుండి వస్తున్న ఎర్టిగా కారును ద్విచక్ర వాహనదారులు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. స్థానిక పోలీసులు కేసును విచారణ చేపట్టారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక - కడ పి.డి.



కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ స్థాయిలో ప్ర జా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పంలో నిర్వహిస్తు న్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పం మండల కార్యా లయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేట యుగంధర్‌కు నాగభైరవ సాహిత్య పురస్కారం

వెదురుకుప్పం,ఆగస్టు 16 ప్రభాతవార్త :



ప్రముఖ బాల సాహిత్య రచయిత పేట యుగంధర్‌కు నాగభైరవ సాహి త్య పురస్కారం ఆదివారం ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు ఒంగో లులోని రంగభవన్‌లో నాగభైరవ సా హిత్య పీఠం ఆధ్వర్యంలో దివంగత కవి రచయిత డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు జ్ఞానపకార్థం ఏటా నిర్వహించే పురస్కార ప్రధానోత్సవ సభ వైభవంగా నిర్వహించారు. న్యాయనిర్ణేతలు వాటిని నిశితంగాపరిశీలించి ఉత్తమ బాలసాహిత్య నవలగా పేట యుగంధర్ రాసిన జాను అనే నేను - నా స్నేహితురాళ్ళను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థప అధ్యక్షులు నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పిల్లల్లో పుస్తక పఠనాసక్తిని పెంచేందుకు వారిలోని నైతిక విలువలను పెంపొందించేందుకు బాలసాహిత్యం ఎంతగానో దోహదపడుతుందన్నారు. యుగంధర్ నవల రచన బాలల మనస్తత్వాన్ని, వారిలోని సహజసిద్ధమైన భావోద్వేగాలను, స్నేహ మాధుర్యాన్ని అద్భు తంగా ఆవిష్కరించారని ప్రశంచించారు. దృఢసంకల్పం ఉంటే ఆడపిల్లలు ఎంతటి లక్ష్యానైన సాధిం చగలరన్న ఆత్మవిశ్వాసాన్ని రచయిత ఈ నవల ద్వారా అద్భుతంగా చాటిచెప్పారని ప్రశంసించారు. అనం తరం బాల సాహిత్య రచయిత పేట యుగంధర్‌ను దుశాలువతో సన్మానించి జ్ఞాప్తిక అందజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా దారా సాంబయ్య, నల్లూరి వెంకటేశ్వర్లు, ఆదర హరిబాబు, వీరవల్లి సుబ్బారావు,బెజవాడవెంకట్రావుపెద్ద సంఖ్యలో సాహితీ ప్రియులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమ పథకాల పట్ల ప్రజల ఆసక్తి

ముక్కా రూపానంద రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 16 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియో జకవర్గంలో కూటమి ప్ర భుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆసక్తిగా సంతో షాన్ని వ్యక్తం చేస్తున్నా రని రైల్వేకోడూరు టిడి పి ఇన్చార్జ్ ముక్కా రూ పానంద రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక రాఘవ రాజాపురంలో ఉన్న టిడిపి కార్యాల యంలో కొంతమంది కార్యకర్తలు రూపనంద రెడ్డిని పూలమాలలతో సన్మానించిన సందర్భంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాల ద్వారా ప్రజలు ఆసక్తికరంగా ఉన్నారని అన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధిని కోరుకుంటూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతున్నారని అన్నారు. ప్రజా సంబంధమైన కార్యక్రమాలను ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తూ చెప్పిందే చేస్తున్న హామీలను ప్రజలు స్వీకరిస్తున్నారని అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి మండలాలలో కోట్లది రూపాయల పనులను చేపడుతుందని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడ ఏది అవసరమో ఆ కార్యక్రమాలను చేపట్టడంలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదని అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం చౌకబారు ప్రకటనలతోనే కాలయాపన చేసిందని అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం శ్రమిస్తానని అన్నారు. టిడిపి కార్యకర్తలకు రానున్న రోజుల్లో మంచి రోజులు రానున్నాయని వారు అన్నారు. ఇటీవల జరిగిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రజలు ఆశీర్వదించారని ప్రజా సమస్యలను ఎక్కడ అవసరమా అక్కడే వేగవంతంగా వారి అవసరాలను తీరుస్తున్నామని అన్నారు. గత కొన్ని నెలలుగా తమ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ఎన్నో ప్రజల అవసరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేగవంతంగా కృషి చేశామని ఆయన అన్నారు. ప్రజా జీవితంలో ఆటుపోట్లు సర్వసాధారణమని అయితే అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారని వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని రంగాలలో రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడం ధ్యేయంగా పెట్టుకొని పనిచేస్తున్నామని రూపనంద రెడ్డి అన్నారు.

## రాజకీయాల్లో విలువలకు ఆదర్శం వాజ్‌పేయి

తిరుపతి,ఆగస్టు 16ప్రభాతవార్త:



భారత రాజకీయాల్లో విలువలకు, ఆదర్శాలకు ప్రతీకగా నిలిచిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి అని బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని తిరుపతిలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. జాతీయ సమైక్యత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ప్రధానిగా ఆయన హయాంలో స్వర్ణ చతుర్భుజ రహదారి ప్రాజెక్టు, పోఖ్రాన్ అణు పరీక్షలు, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని దేశ ప్రగతికి బాటలు వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, జనార్దన్ రెడ్డి,పాటిబండ మురళి, విగ్రహాల కళ్యాణి, డిఎంకె గణేష్ రాయల్, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి, వాసు, వెంకటరత్నం పాల్గొన్నారు

## ఉచితకంటిఆపరేషన్లకు 49మంది ఎంపిక



కుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

సాయిమాతా సేవా ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకా రంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారు కుప్పంలో నిర్వహిం చిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. 160మం దికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 49మందిని ఉచిత కంట ి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, వైద్య సిబ్బంది శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలన చంద్రబాబుతోనే సాధ్యం



శాంతిపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త

పేదరిక నిర్మూలన సిఎం చంద్రబా బుతోనే సాధ్యమవుతుందని యూని ట్ ఇన్‌చార్జ్ రాజేం ద్ర పేర్కొన్నారు. ఆదివారం సంతూరు, నిమ్మనపల్లి, దండికుప్పం గ్రామాల్లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం చేపట్టారు. కూట మి ప్రభుత్వం అధికార ంలో వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. స్థానిక ఎన్నికల్లో తెదేపాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జయపాల్, మునిరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

## రజకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

వి.కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త



రాష్ట్రంలోని రజక కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం వి.కోటలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎపి రజక ఎస్టీ సాధన కోర్ కమిటీ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంకు కోర్ కమిటీ సభ్యుడు సోమశేఖర్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రజకులు ఐకమత్యంతో ఎస్టీ సాధన హోదాకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిత్తూరు టౌన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ షణ్ముగం మాట్లాడుతూ దేశంలో 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా రెండు రాష్ట్రాల్లో ఎస్టీలుగా ఉన్నారన్నారు. ఎపిలో మాత్రం ఇంకా బిసి-ఎ జాబితాలోనే ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంకు పంపాలన్నారు. రజక కులస్తులకు తగు బడ్జెట్, పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రనాయుడు మాట్లాడుతూ సమావేశ తీర్మానాన్ని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ద్వారా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ నారాయణ, మల్లల నాగరాజు, మోహన్, చిన న్నస్వామి, స్థానిక గంగాభవాని రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## చందాలేసుకుని రోడ్డుపై గుంతలు పూడ్చారు



వి.కోట, ఆగస్టు 16 ప్రభాతవార్త

స్థానిక కెజిఎఫ్ మార్గంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ఎదుట సిమెంట్ రోడ్డు గుంతలుగా మా రింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కె ట్‌కు వచ్చే రైతులు, ప్రజలు దీనిపై ఆవేదన వ్యక్త ం చేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోగా స్థానికులైన దుకాణదారులు చందాలు వేసుకుని గుంతలకు మట్టి వేసి పూడ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

## రామకుప్పంలో ఇంటింటికీ తెదేపా

రామకుప్పం, ఆగస్టు 16 ప్రభాతవార్త

రామకుప్పంలో ఆదివారం ఇంటిం టికీ తెదేపా కార్యక్రమంను నేతలు చేపట్టారు. మాజీ ఎంపిపి ఆంజనే



యరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో నేతలు సలాంసాబ్, ఆదిల్, అల్లిశీను, నియాజ్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పాయి వర్ధంతి వేడుకలు

ఓబులవారిపల్లి,ఆగస్టు 16 ప్రభాతవార్త

భారత మాజీ ప్రధాని బిజెపి సీనియర్ నాయకులు అటల్ బిహారీ వాజ్పేయి వర్ధంతి వేడుకలు ఆది



వారం ఓబులవారిపల్లి మండలంలోని ఆర్‌ఆర్ సెంటర్లో వాజ్పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు గడ్డం చెంగల రాజు మండల బిజెపి అధ్య క్షుడు ముఖ రూపేష్ రెడ్డి శంకరయ్య మరియు బిజెపి నాయకులు కార్యకర్తలునివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా విలువలకు కట్టుబడి నిష్పక్షపాతముగా నిజాయితీగా ఒక ఓటు తేడా ఉన్న భారత ప్రధానిగా తప్పుకొని దేశానికి ఆదర్శంగా నిలిచిన మహోన్నత వ్యక్తిని ఆయన అడుగుజాడల్లో నేడు యువత నడవాలని దేశానికి ఆదర్శివంతులుగా ఎదగాలని వారు సూచించారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## నేడు పోలీసు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ దూడి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు నేరుగా హాజరై తాము క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించుకోవచ్చును.

## ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి




చిత్తూరుహెల్త్, ఆగస్టు 16 ప్రభాతవార్త:

జిల్లా పోలీసు సాయుధదళ కార్యాల యంలో ఆదివారం స్వాతంత్ర్య సమ రయోధుడు, రైతు కూలీల హక్కుల పోరాట యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117 జయంతి ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ప్రజల పక్షాన ఎల్లప్పుడు నిలబడ్డ మహనీయుడని, ఆయన జీవితం అందరికి స్ఫూర్తి దాయకమన్నారు. నిజమైన సేవ అనేది అధికారంలో కాకుండా, ప్రజల హృదయాల్లో వుండటంలో వుందనే విషయం సర్దార్ గౌతు లచ్చన్న నిరూపించాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సేవకు హెచ్‌సి ఖాదర్‌భాషాకు మంత్రి ప్రశంస



చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:

పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఖాదర్ భాషాను రాష్ట్ర వైద్య విద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశం సించారు. చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో ఆదివారం జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుక ల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ దూడి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌నాయుడు సమక్షంలో జిల్లా కోర్టులో పోలీసు శాఖకు లైజన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌భాషాను అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నుండి ప్రశంసాపత్రం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌భాషా మాట్లాడుతూ పోలీసు శాఖ తనకు అప్పగించిన విధులను నిర్వర్తించి ప్రజలకు సేవ చేస్తున్నానని, తాను ఇది వరకు చిత్తూరు ట్రాఫిక్, చిత్తూరు టుటౌన్, పాలసముద్రం పోలీస్ స్టేషన్లలో విధుల నిర్వర్తించానని, ప్రస్తుతం తాను జిల్లా కోర్టులో పోలీసు శాఖ తరపున లైజన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు.

## ఆరుముగం మృతి పార్టీకి తీరని లోటు

గుడిపాల, ఆగస్టు 16 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంకు చెందిన మాజీ ఎంపిటిసీ భర్త, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరుము గం మృతి చెందడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుబ్రమ ణ్యంనాయుడు అన్నారు. ఆరు ముగం ట్రాక్టర్ కింద చిక్కుకొని శని వారం మృతి చెందడంతో స్వగ్రామంలో ఆయనకు ఆదివారం దహనక్రియలు నిర్వహించారు. ఆరు ముగం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మండల తెలుగుదేశం అధ్యక్షులు సుబ్ర మ ణ్యంనాయుడు మాట్లాడుతూ ఆరుముగం మృతి చెందడం పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబానికి పార్టీ అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అనిల్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ శరత్‌బాబు, నాయకులు శంకర్‌చౌదరి, రవినాయుడు, శింబు, గోపి, లలితాచౌదరి, స్థానిక నాయకులు అర్జున్, గణేష్, పయణి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన ఎంపిపి

గుడిపాల, ఆగస్టు 16 ప్రభాతవార్త:



రాష్ట్ర వైద్య విద్యశాఖ మంత్రి సత్య కుమార్ యా దవ్‌ను గుడిపాల మండల పరిషత్ అధ్యక్షులు గోళ్ళ హరిప్రసాద్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన డానికి చిత్తూరు వచ్చిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి కలిసి సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి మండల పరిధిలో వున్న సిఎంసి ఆసుపత్రిని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని, ఆరోగ్యశ్రీ పథకం సిఎంసి హాస్పిటల్‌లో వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, పేద ప్రజలకు మెరుగైన వైద్యం నిమిత్తం గుడిపాల పిహెచ్‌సిని సిహెచ్‌సి స్థాయి కల్పించాలని ఆయన విన్నవించారు.

## 31లోపు కళాకారులు దరఖాస్తులు

కాణిపాకం, ఆగస్టు 16 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కళా ప్రదర్శనలు ఇచ్చే కళాకారులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని దేవస్థానం ఇఓ పెంచల కిషోర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 4 వరకు స్థానిక ఆస్థాన మండపంలో ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదలచుకున్న కళాకారులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన తెలిపారు.

# తిరుపతి డివిజన్

## బండారుపల్లి ఉన్నత పాఠశాలలో గురువులకు పాదపూజ




ఏర్పేడు, ఆగస్టు 16 ప్రభాతవార్త

ఏర్పేడుమండలం బండారుపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులచే గురువులకు పాదపూజలు జరిపారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పాఠశాలల్లో పూర్వ విద్యార్తుల సమ్మేళనంతో పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు.ఈ నేపథ్యంలో క్లాస్‌రూమ్ బెంచీలు, మాస్టారి దండం ,స్నేహితులతో కబుర్లు 37 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలన్నీ ఒకేచోట పునఃసృష్టి అయ్యాయి. 1988 89 సంవత్సరంలో జడ్పీ హైస్కూల్ బండారుపల్లిలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పూర్వ విద్యార్థులు పాదపూజ చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. వసంతమ్మ, రాజశేఖర్, వెంకటరమణ గురువులను శాలువాలతో సత్కరించారు. ఉత్సాహభరితమైన వాతావరణంలో పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, కలిసి విందు భోజనం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, త్వరలో పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ..88 89 బ్యాచ్ సహకారంతో ఒక వేదికను.. నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రెడ్డివారి గురువారెడ్డిని సైతం మిత్రులందరూ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. "గురువు, గుడి, పాఠశాల రుణం తీర్చుకోవడమే మా లక్ష్యం" అని పూర్వ విద్యార్థులు ఒకే గొంతుతో నినదించారు.

## ఉపాధ్యాయుల దరఖాస్తులకు ఆహ్వానం

తడ ఆగస్టు 16 ప్రభాతవార్త



తడ మండలం అక్కంపేట ఏపీ మోడల్ స్కూల్ లో గెస్ట్ ఉపాధ్యాయులుగా పనిచేయుటకు దరఖాస్తులు కోరుచున్నామని ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదర్శ పాఠశాలలో తెలుగు ఇంగ్లీషు మరియు సైన్స్ లలో గ్రాడ్యుయేట్ పోస్టులు మూడు (3 )ఖాళీగా ఉన్నాయని వాటికోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు వీటికి సంబంధిత సబ్జెక్టులు డిగ్రీ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత మరియు సంబంధిత సబ్జెక్టులు బిఈడి చేసి ఉండాలని తెలిపారు వీరికి నెలకు 12000 రూపాయలు గౌరవ వేతనం చెల్లించబడుతుందని తెలిపారు. వీరి ఎంపిక ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డిఇఓ చైర్మన్ గా గలిగిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందని తెలిపారు అర్హులైన వారందరూ ఈ నెల 20వ తేదీ లోపల ఆదర్శ పాఠశాల ఆఫీసులో అందజేయాలని కోరారు వీరు సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి విధులలో చేరవలసి ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తెలిపారు

## తొట్టంబేడు మండలంలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం..

తొట్టంబేడు, ఆగస్టు 16 ప్రభాతవార్త ..

తొట్టంబేడు మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఇఓ సిహెచ్ భారతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 9 పోస్టులుఖాళీగా ఉన్నాయి.. ఎస్ జి టి7 ఇంగ్లీష్ 1,తెలుగు1 ,అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను ఆగస్టు 16 నుంచి ఆగస్టు 21 లోపు తొట్టంబేడు మండల విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని విద్యాశాఖ అధికారులు తెలియజేశారు. నిర్ణీత తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోబడవని అధికారులు స్పష్టం చేశారు.

## ఆహ్లాదానికి నిలయం: దోపిడితో సతమతం

తొట్టంబేడు, ఆగస్టు 16 ప్రభాతవార్త




శ్రీకాళహస్తిలోని పరిమితంగా ఉన్న సినిమా థియేటర్లు ఆహ్లాదానికి నిలయాలుగా చెబుతారు.అయితే ఇక్కడ ఉన్న థియేటర్లతో ఒకటి దోపిడి కేంద్రంగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి.థియేటర్లలోకి అడుగుపెట్టాలంటే జనం భయ భ్రాంతులౌతున్నారు.ఈ థియేటర్‌కు సంబంధించి ఉన్నతాధికరులకు ఫిర్యాదులు అందటంతో చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రముఖ ఆర్‌ఆర్ థియేటర్ యాజమాన్యం సాధారణ ప్రేక్షకుల నుండి అధిక రుసుములు వసూలు చేస్తున్న తీరును ఎఐయఫ్ తీవ్రంగా ఖండించింది.రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి ఆదివారం ధ్వజమెత్తారు. వారు థియేటర్ యాజమాన్యం ప్రేక్షకులపై అనవసర భారాలు మోపుతోందని ఆరోపించారు.

బయట మార్కెట్‌లో 20 ఉన్న 1 లీటర్ వాటర్ బాటిల్‌ను లోపలికి అనుమతించడం లేదు. క్యాంటీన్‌లో అద్దే బాటిల్‌ను రూ.10లు అదనంగా వసూలు చేసుకుంటూ ఇబ్బంది పెడుతున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో 3 గంటల సినిమా సమయంలో నీరు తప్పనిసరి అని తెలిసి కూడా బలవంతపు విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు,బైక్ పార్కింగ్ ఫీజు మున్సిపల్ నిబంధనల ప్రకారం 2 గంటల వరకు బైక్ పార్కింగ్‌కు గరిష్టంగా 10 మాత్రమే వసూలు చేయాలి. కానీ టికెట్‌తో సంబంధం లేకుండా ప్రతి బైక్‌కు 20 ఫిక్స్‌గా వసూలు చేస్తున్నారు.స్నాక్స్ ధరలు దడపుట్టిస్తున్నాయి.బయటి మార్కెట్లో రూ.20లు కూడా పలకని ధరను రూ.150లు వసూలు చేసుకుంటారు.డ్రింక్స్ కోక్ రూ.50లు వసూలు చేసుకుంటారు. సమోస బయటిమార్కెట్లో రూ.10లు చేయనిది రూ.30లు వసూలు చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చేవారికి ఇది అదనపు భారంగా మారిందన్నారు.సినిమా టికెట్ ధరలు, జి ఎస్ టి కన్వీనియన్స్ ఫీజు ఇప్పటికే ఎక్కువగా ఉన్నాయని, ఇలాంటి సమయంలో నీరు, పార్కింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలపై కూడా దోపిడీ చేయడం సామాన్య, మధ్యతరగతి ప్రేక్షకులను ఇబ్బంది పెడుతోందని కత్తి రవి పేర్కొన్నారు.వాటర్ బాటిళ్లను బయటి నుండి లోపలికి అనుమతించాలి. లేదా ఎంఆర్పి రేటుకే అమ్మాలి,బైక్ పార్కింగ్ ఫీజును ప్రభుత్వం నిర్దేశించిన 10కే పరిమితం చేయాలి ,అదనంగా వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇవ్వాలి,టికెట్ కౌంటర్ వద్ద రేట్ చార్ట్ స్పష్టంగా ప్రదర్శించాలి జిల్లా కలెక్టర్, ఆర్డీవో , సివిల్ సప్లైస్, పోలీస్ అధికారులు వెంటనే తనిఖీలు చేయాలని. వినోదం పేరుతో ప్రజల జేబులకు చిల్లు పెట్టే చర్యలను ఖండిస్తున్నామని, 7 రోజుల్లో అక్రమ వసూళ్లు ఆపకపోతే ప్రజా సంఘాలతో కలిసి థియేటర్ ముందు నిరసన చేపడతామని ఎఐయఫ్ హెచ్చరించింది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సామాన్య ప్రేక్షకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## గ్రామీణ ఐకమత్యానికి సద్గురు గ్రామోత్సవం



తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త

గ్రామాల పునరుద్ధరణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఐకమత్యం, సామూహిక భావన, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు సద్గురు గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామోత్సవం 18వ సంవత్సరంలోకి ప్రవేశించగా, ఈసారి 10 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఈ క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మొత్తం ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు అందిస్తున్నారు. గ్రామోత్సవంలో మొత్తం రూ.కోటి వరకు ప్రైజ్‌మనీ ఉండటం విశేషం. విజేత జట్లకు కోయంబత్తూరులోని ఆదియోగి సన్నిధిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు.త్రోబాల్‌లో అత్యుత్తమ క్రీడాకారిణికి రూ.1.20 లక్షల విలువైన బైక్‌ను గ్రావిటాన్ సంస్థ స్పాన్సర్ చేసింది. త్రోబాల్ పోటీల్లో తిరుపతికి చెందిన శివశక్తి, తిరుచందూర్ జట్లు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్‌లో నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది.గ్రామోత్సవం కేవలం విజేతలను తయారు చేయడం లేదా క్రీడా పోటీలకే పరిమితం కాకుండా గ్రామాల్లో సంబర వాతావరణాన్ని తీసుకురావడం, ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించడం, సామూహిక భావనను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది. గ్రామీణ యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడంలో గ్రామోత్సవం కీలక పాత్ర పోషిస్తోంది.గ్రామోత్సవం కోసం వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి క్రీడాకారులను ఎంపిక చేసి జట్లను ఏర్పాటు చేశారు. ఎంపికైన క్రీడాకారులకు రెండు నెలల పాటు శిక్షణ అందించడంతో పాటు అవసరమైన క్రీడా సామగ్రిని కూడా అందించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

## సేవా పురస్కారం అందుకున్న డా. భువనేశ్వరి



తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందించే విశిష్ట సేవా పురస్కారాన్ని శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి దేవి అందుకున్నారు. విద్యా రంగంలో సేవలతో పాటు కళాశాల అభివృద్ధికి అందిస్తున్న కృషిని గుర్తిస్తూ టీటీడీ ఆమెను ఈ పురస్కారంతో సత్కరించింది.టీటీడీ ఈవో రవిచంద్ర చేతుల మీదుగా డా. భువనేశ్వరి దేవి పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పురస్కారం అందించడం ఎంతో సంతోషంగా, బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ గౌరవం మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.శ్రీ పద్మావతి మహిళా కళాశాల అభివృద్ధి, విద్యార్థినుల విద్యా ప్రగతి, కళాశాలలో నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు డా. భువనేశ్వరి చేస్తున్న కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచిందని అధ్యాపకులు తెలిపారు. ఆమె నాయకత్వంలో కళాశాల మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షి ంచారు.పురస్కారం అందుకున్న డా. సి. భువనేశ్వరి దేవికి కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకుని, శ్రీ పద్మావతి మహిళా కళాశాల ఖ్యాతిని మరింత పెంచాలని వారు కోరుకున్నారు.

## శ్రీ కరుమారియమ్మ దేవాలయంలో ముగిసిన ఆడి నెల మహోత్సవాలు



తిరుపతి, ఆగస్టు 16 ప్రభాతవార్త

శ్రీకరిమారియమ్మ దేవాలయంలో భక్తిశ్రద్ధల నడుమ ఆదివారం అగ్ని గుండంతో ఆడి నెల మహోత్సవాలు ముగిసాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతి ఏడాది ఆడి నెలలో 30 రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాలు భక్తుల్లో విశేష ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతున్నాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆలయ పూజారి వేలాయుధం, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, హరి కుమారి, ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ, హరి కుమారి, మునిరాజా, వెంకట ముని, దేనా, గుణశేఖర్, మాధవ, వెంకటేశ్వర్లు ఆనంద, సుబ్రహ్మణ్యం, బాబు, రేవతి, ఉషారాణి, అల్లిరాణి, గాలం కాంచనమ్మ, కుమారి, గీతమ్మ, ప్రియాంక, ద్రాక్షాయని, ప్రతిభ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో గౌతు లచ్చన్న జయంతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త



భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి సర్దార్ అనే బిరుదును సొంతం చేసుకున్న సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శ్రీకాళహస్తిలో ఆదివారం ఎ నిర్వహించారు. స్థానిక జెడ్పి ఉన్నత బాలుర పాఠశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం వద్ద ఉదయం నుంచే సంబరాలు ఏర్పాటు చేసారు. సర్దార్ విగ్రహానికి అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. గౌడ్ సంఘం నాయకులు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సర్దార్ గౌతు లచ్చన్న త్యాగాలను గుర్తుచేసుకుంటూ, నేటి తరం యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. "సర్దార్ లచ్చన్న లాంటి మహనీయుల త్యాగఫలమే నేటి స్వేచ్ఛా భారతం. వారి స్ఫూర్తితో సమాజ సేవ చేయాల్సిన అవసరం ఉంది" అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మోహన్ గౌడ్, ముద్దా రాధాకృష్ణ గౌడ్, అంజూరు ఈశ్వరయ్య గౌడ్, తిరుక్కాల ఆనంద్ గౌడ్, కళాత్తురు రవి గౌడ్, జడపల్లి మునిశేఖర్ గౌడ్, అప్పలాల గణేష్ గౌడ్, గుడియాత్తం శరవణ గౌడ్, అనేం చక్రి గౌడ్, బంగారప్ప గౌడ్, రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గార్లపాటి శ్రీధర్ ఏఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియామకం

తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త



ఆంధ్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యం. హేమాద్రి యాదవ్ ఆదేశాల మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చివటం శివ , గార్లపాటి శ్రీధర్‌ను ఆంధ్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం 16 .08.2026 నుంచి ఉత్తర్వులు జారీ చేసిన సమయం నుంచే తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపారు.జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గార్లపాటి శ్రీధర్ తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆంధ్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యక్రమాలను విద్యార్థులకు మరింత చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణలో నిర్మాణాత్మకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షి ంచారు.అలాగే ఆంధ్రా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆశయాలు, సిద్ధాంతాలు, కార్యక్రమాలను తిరుపతి జిల్లా వ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తూ విద్యార్థులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. గార్లపాటి శ్రీధర్ నియామకం పట్ల ఏఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## కస్తూరి రత్నం వర్ధంతి సందర్భంగా మెగా వైద్య శిబిరం

తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త



మాజీ మంత్రి పరసా రత్నం సతీమణి పరసా కస్తూరి రత్నం 6వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్, పూలే ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కస్తూరి రత్నం జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడేలా ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆనంద్‌రావు, ఎమ్మెల్యేలు విజయశ్రీ, సునీల్ కుమార్, రామకృష్ణ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సూరజ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నర్సింహ యాదవ్, సదాశివమూర్తి, ట్రస్ట్ నిర్వాహకులు షాలిని రత్నం, సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ వైద్య విభాగాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వందలాది మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సేవలు అందించారు.అదేవిధంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ప్రాధాన్యతపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రజలందరికీ భోజన సదుపాయం కల్పించారు. కస్తూరి రత్నం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరం, రక్తదాన కార్యక్రమం, భోజన ఏర్పాట్లకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 'సమాజంలో మార్పు రావాలంటే సేవా భావం ఉండాలి" మునీర్ భాష

శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త



సమాజంలో నేడు చోటు చేసుకున్న వాతావరణంలో మార్పు రావాల్సిన అవసరం ఏంతైనా ఉందని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్తాపకులు మునీర్‌బాషా అన్నారు. ప్రతి ఒక్కరిలో సేవా భావం అలవడాలన్నారు. పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ దర్భంగా మునీర్ భాష మాట్లాడుతూ.. "గత 176 నెలలుగా మా సభ్యులు ఎంతో కష్టపడి ఈ సేవను కొనసాగిస్తున్నారు. ఇది ఒక్క సంస్థ పని కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేస్తే ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపవచ్చు" అన్నారు. "సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉంది. ప్రత్యేక ప్రతిభావంతుల ముఖాల్లో కనిపించే చిరునవ్వే మాకు అసలైన బహుమతి" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.హెల్పింగ్ హ్యాండ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మునీర్ భాష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గరికపాటి రమేష్, హబీబ్‌తదితరులు కృషి చేశారు.

## "వెండితో సత్కారం టాపర్లను ప్రోత్సాహం

### దిస్కూల్‌లో సంబరాలు




శ్రీకాళహస్తి, ఆగస్టు 16 ప్రభాతవార్త

స్వాతంత్రం తెచ్చిన త్యాగా లను గుర్తుచే సుకుంటూనే, విద్యా రంగంలో రాణించి ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ది స్కూల్ ఘనంగా సత్కరించింది. పట్టణంలోని ది స్కూల్‌లో ఆదివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గత ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వెండి కాయిన్లు అందజేశారు.పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్ రావు జె. పవార్ ద్వారా టాపర్లను సన్మానించారు. అందులో భాగంగాఎం. రితిక 594 మార్కులతో పట్టణంలోనే అత్యధిక స్కోర్ సాధించి 30 గ్రాముల వెండి కాయిన్ అందుకుంది. ఎ. భవిత 589, ఎం. అగస్య సాయి 588, కె. చరణ్ 581 మార్కులు సాధించి చెరో 20 గ్రాముల వెండి కాయిన్, దుశ్శాలువాతో సత్కారం అందుకున్నారు. కేవలం మార్కులు మాత్రమే కాదు, క్రమశిక్షణ, కృషికి ఇది నిదర్శనమని కరస్పాండెంట్ ప్రశంసించారు.విద్యార్థుల విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయ బృందం శ్రమను గుర్తిస్తూ వారిని నగదు బహుమతితో సన్మానించారు. జనార్ధన్ రావు జె. పవార్ మాట్లాడుతూ ది స్కూల్‌లో కేవలం పాఠాలు మాత్రమే కాదని, భవిష్యత్తుకు అవసరమైన సాంకేతిక విద్య, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని నేర్పిస్తున్నామన్నారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సన్మాన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విశాల అధ్యక్షత వహించారు.

## టెట్ 11వ రోజు 91.25 శాతం హాజరు

తిరుపతి విద్య, ఆగస్టు 16 ప్రభాతవార్త



ఏపీ టెట్-2026 పరీక్షల 11వ రోజు తిరుపతి జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ తెలిపారు. జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు.ఆదివారం మొత్తం 1,223 మంది అభ్యర్థులకు పరీక్ష రాసే అవకాశం కల్పించగా, 1,116 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 107 మంది గైర్హాజరయ్యారు. దీంతో మొత్తం 91.25 శాతం హాజరు నమోదైనట్లు డీఈఓ కె.వి.ఎన్. కుమార్ వెల్లడించారు.పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో పరీక్షలు సజావుగా కొనసాగాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కేంద్రాల వద్ద నిరంతరం పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామని డీఈఓ కె.వి.ఎన్. కుమార్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో సహకరిస్తున్న అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.